క్లుప్తంగా

గుండె వైద్య శిబిరానికి స్పందన



నిజాంపట్నం: గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ది అపోస్తల్స్ మిషన్ ట్రస్ట్ చైర్మన్ గుడిపల్లి పరంజ్యోతి తెలిపారు. మండలంలోని అడవులదీవి గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పటల్స్ సౌజన్యంతో మంగళవారం ఉచిత గుండె వ్యాధుల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పరంజ్యోతి మాట్లాడుతూ కరోనా తరువాత గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్ప్ వైద్యశాల వైద్యులు ఆయాసం, గుండె నొప్పి, గుండెలో మంట, గుండె బరువుగా ఉండటం వంటి పరీక్షలను రోగులకు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు, గుండె స్కానింగ్ పరీక్షలు చేశారు.శిబిరంలో రోగులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు.

వైఎస్సార్ సీపీతోనే మహిళాభ్యుదయం



చింతమోటు(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యుదయమే ధ్యేయంగా గత ఐదేళ్లలో పాలన చేశారని వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని చింతమోటు, భట్టిప్రోలు, కుమ్మరిగుంటవారి వీధిలో మహిళలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి శంకరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాము, జయకృష్ణ, నాగార్జున, జంపాని రవి, యలవర్తి కిషోర్, రావుల బుజ్జి, భట్టిప్రోలులో నిర్వహించిన సర్పంచ్ దారా రవికిరణ్మయి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు డి. చెన్నయ్య, నాగమల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలు మండలంలో ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భట్టిప్రోలు మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ క్యాంప్ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఉదయం పెసర్లంక, పెదలంక, చింతమోటు, మధ్యగూడెం, వెల్లటూరు, పెదపాలెం, పెదపులివర్రు, సాయంత్రం గొరిగపూడి, కోళ్లపాలెం, దాసరిపాలెం గ్రామాలలో ప్రచారం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్ పిట్టు నాగేంద్రమ్మ మృతి

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పిట్టు నాగేంద్రమ్మ(75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈమె మాజీ సర్పంచ్ పిట్టు దశరథ రామిరెడ్డి సతీమణి. మాజీ సర్పంచ్ పిట్టు విఘ్నేశ్వరరెడ్డి తల్లి. మంగళవారం స్వగ్రామం పిట్టువారిపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మోదుగుల బసవపున్నారెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు పిట్టు సాంబశివమ్మ, పిట్టు సాయిబాబారెడ్డి, యేట్ర బోసురెడ్డి తదితరులు నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

వ్యక్తికి గాయాలు

చెరుకుపల్లి: జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని ద్విచక్ర వాహనదారుడి కాలుకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం నడింపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నడింపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఆరాధ్యుల రోశయ్య చెరువు పక్కనే ఉన్న డొంక రోడ్డు లో నుంచి జాతీయ రహదారి పైకి రాగా చెరుకుపల్లి వైపు నుంచి భట్టిప్రోలు వైపుకు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టటంతో బైక్ నడుపుతున్న రోశయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో తెనాలి ఏరియా హాస్పిటల్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వరికూటి రాకతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

- వేమూరు నియోజకవర్గంలో విస్తృత ప్రచారంతో ముందుకు సాగిపోతున్న అశోక్‌బాబు
- వేమూరులో వైఎస్సార్ సీపీ గెలుపునకు బాటలు



వేమూరు ఎన్నికల ప్రచారంలో అశోక్‌బాబు(ఫైల్)

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారంలో రేసు గుర్రంలా దూసుకు పోతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్లపాటు పరిపాలన చేశారు. ఆయన పాలన సాగిన తీరును ప్రజలకు వివరిస్తూ అశోక్‌బాబు ముందుకు సాగుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి తెలుసుకొని సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరుతున్నారు. 17 రోజుల నుంచి ఆయన ప్రజలతో మమేకమవుతున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ పట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలో మరోసారి ఫ్యాన్ హవా ఖాయమని అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం జోరు పెంచినట్లు కనిపిస్తోంది. పార్టీ శ్రేణులను కలుపుకొని ఆయన నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

సంక్షేమ పథకాలే గెలుపుకు పునాది

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు వైఎస్సార్ సీపీ గెలుపుకు నాంది పలుకుతాయని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించి ప్రతి కుటుంబంలో వెలుగు నింపారని, తామంతా వైఎస్ జగన్‌కు ఓటేస్తామని ముక్తకంఠంతో పేర్కొంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. అనూహ్యంగా తెరపైకి వచ్చిన అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని ప్రచారం వినిపిస్తోంది. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోనూ, వేమూరు నియోజకవర్గంలోనూ మరొసారి జెండా ఎగుర వేయడం ఖాయమని ప్రజలు చెపుతున్నారు.

పేదల పక్షపాతి వరికూటి

ఉన్నత ఉద్యోగాన్ని(ఆర్టీవో) వీడి పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో రాజకీయాల్లో ప్రవేశించిన వరికూటి అశోక్‌బాబు గత 15 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారు. 2009లో ప్రజారాజ్యంలో చేరారు. అటుపిమ్మట వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించిన నాటి నుంచి పార్టీలోనే ఉంటూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తూ అక్కడ నుంచి అభ్యర్థిత్వం ఆశించిన అశోక్‌బాబుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేమూరు నియోజకవర్గం స్థానాన్ని కేటాయించారు. 2014 లోనూ టిక్కెట్ ఆశించినప్పటికీ అవకాశం లభించక పోవడంతో నిరాశ చెంద కుండా పార్టీ గెలుపు కోసం పని చేశారు. 2014లో కొండేపి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జూపూడి ప్రభాకర్ పార్టీ మారారు. అప్పటినుంచి కొండేపి నియోజకవర్గం పార్టీ బాధ్యతలు తన భుజ స్కంధాలపై వేసుకొని పార్టీ కోసం పని చేశారు. 2019 లోనూ టిక్కెట్ తనకు వస్తుందని ఆశించినప్పటికీ ఆ పర్యాయం కూడా లభించలేదు. అయినప్పటికీ తాను నమ్మిన జగన్‌మోహన్‌రెడ్డి కోసం పని చేస్తానని కంకణం కట్టుకొని పార్టీ అభివృద్ధి కోసం పాటు పడ్డారు. ఆ పర్యాయం వైఎస్సార్ సీపీ టిక్కెట్ పొందిన వెంకయ్య కొండేపిలో ఓటమి పొందారు. కొండేపి నియోజకవర్గంలో టీడీపీ గెలవడంతో మళ్లీ నియోజకవర్గం బాధ్యతలను అశోక్ బాబుకు పార్టీ అధిష్టానం అప్పగించింది. పార్టీ శ్రేణులను సమన్వయపరుస్తూ పార్టీని ముందుకు నడిపిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు పార్టీ అధిష్టానం వేమూరు వెళ్లాలని కోరగా అధిష్టానం ఆదేశాల మేరకు వేరే ఆలోచన లేకుండా నాలుగు మాసాల క్రితం వేమూరు వచ్చారు. నాటి నుంచి నేటి వరకు పార్టీని తనదైన శైలిలో నడిపిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకున్నారు. వరికూటి అతి తక్కువ సమయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులను కలుపుకొని పోతూ రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు సైతం పాలు పంచుకుంటున్నారు. ఊరూ వాడా ప్రచారం ముమ్మరం చేసి ప్రజల విశ్వాసం సంపాదించుకున్నారు. వరికూటి అశోక్‌బాబు విజయం వేమూరు నియోకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి సోపానమని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): ఎలాంటి ఫలితం ఆశించకుండా సహాయం చేయడమే సేవ అని కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. కర్లపాలెం రాజీవ్‌నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితురాలు కొండేటి ధనలక్ష్మికి రెడ్‌క్రాస్ చేయూత నందించింది.తాత్కాలిక గుడారానికి అవసరమైన మెటీరియల్, వంట సామాగ్రి, నిత్యావసర వస్తువులు అందించారు.బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ భట్టు ఆదేశాల మేరకు ఈ సహాయాన్ని అందించామని పోలీసురావు తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఏకశిరి నరసింహారావు, వెంకటరెడ్డి, రాంబాబు, సుభాని తదితరులు ఉన్నారు.

రేపల్లెను గెలిచి జగనన్నకు కానుకగా ఇద్దాం

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- తుమ్మలపాలెం, బలుసుల పాలెం, ఆరుంబాక, కావూరు గ్రామాల్లో ఈవూరితో కలిసి ఎన్నికల ప్రచారం



కావూరులో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఈవూరి గణేష్

చెరుకుపల్లి: రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మలపాలెం, బలుసుల పాలెం, అరుంబాక, కావూరు గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ సీపీ గెలపును కాంక్షిస్తూ ఎంపీ మోపిదేవి రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు డాక్టర్ ఈవూరి గణేష్‌కు మద్దతుగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచి మహిళలకు రాజకీయాల్లో నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు.

డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఎన్నికల ప్రచారం జరిగిన గ్రామాల్లో తుమ్మలపాలెంకు రూ.16.14 కోట్లు, బలుసుల పాలెంకు రూ10.15 కోట్లు, ఆరుంబాకకు రూ 21.61 కోట్లు, కావూరుకు రూ.20.50 కోట్లు చొప్పున ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ బ్రేక్ పడకుండా 99 శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారన్నారు. 2024 ఎన్నికల్లో సైతం విద్యా, వైద్య రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత కలిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ చేయూత ద్వారా అక్క చెల్లెమ్మలకు గతంలో ఇచ్చే రూ.75 వేలకు అదనంగా మరో రూ.75 వేలు పెంచటం జరిగిందన్నారు. రైతులకు రైతు భరోసా ద్వారా ఇస్తున్న రూ.13,500లకు బదులు రూ.16 వేలు ప్రతి ఏటా అందిస్తామన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు అందించామని మరో ఐదేళ్ల పాటు రూ.10 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు చెపారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను దగా చేశారని గుర్తుచేశారు. పేదలందరికీ ఇన్ని సంక్షేమ పథకాలు పది కాలల పాటు అందాలంటే మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగాం సురేష్‌ను రేపల్లె అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని గణేష్ అభ్యర్థించారు. కార్యక్రమంలో బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ వెంకట పావని, మోపిదేవి రాజీవ్, చీరాల ప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి సుమలత, సర్పంచ్‌లు చీరాల చెంచుదేవి, శివరామ కృష్ణారెడ్డి, కామినేని కోటేశ్వరరావు, రావూరి సునీత, పిట్టు నాగేశ్వరమ్మ, మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు చెన్ను కోటేశ్వరరావు, మొగలిపువ్వు శ్రీనివాసరావు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సాధారణ సమావేశం



హాజరైన కౌన్సిలర్‌లు, అధికారులు



రేపల్లె రూరల్: పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి పుర ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటి పన్ను, ఖాళీస్థలం పన్ను, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పన్నులతో పాటు నీటి పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని అన్ని వార్డులకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేయబడునన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో చేతి పంపులకు మరమ్మతులు చేయించటంతో పాటు అవసరమైన చోట్ల బోరు పంపులను వేయిస్తున్నామన్నారు. తాగునీటి చెరువులు నింపుకునేందుకు కాల్వలకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు. అరవపల్లి కాల్వ నుంచి సమ్మర్ స్టోరేజ్ నింపుకునేందుకు 11 పెద్ద మోటార్లతో నీటిని నింపుతున్నామన్నారు. ప్రస్తుతం పట్టణంలో తాగునీటి సమస్య లేదని వివరించారు. పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిస్తున్న ఎన్నికల ప్రచారం

- ఎటు చూసినా ఊరేగింపుల కోలాహలం
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

భట్టిప్రోలు: మండే ఎండలే కాదు.. ఎన్నికల ప్రచారం సైతం వాతావరణాన్ని వేడెక్కిస్తుంది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా 12 రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, అమృతలూరు, కొల్లూరు, వేమూరు, చుండూరు మండలాల్లో ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించడంతో ఆయా గుర్తులు గల పోస్టర్లతో విస్తృత ప్రచారం ప్రారంభించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఊరేగింపులు, ఎన్నికల కోలాహలం నెలకొంది. అలాగే ఓటర్ లిస్టుల ఆధారంగా ఎవరి ఓట్లు వచ్చే అవకాశం ఉంది.. ఎవరు వేయరనే విషయంపై స్థానిక నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో రంగంలోకి దిగిన అభ్యర్థులు ప్రచారం మరింత ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్‌లు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి కారణంగా వైఎస్సార్ సీపీకి గ్రామాల్లో ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న అభిమానంతో మహిళలు, లబ్ధి పొందిన వారు క్యాంపైనర్లుగా వ్యవహరిస్తూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



పిట్టలవానిపాలెం: రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకా రం పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెట్రోలు బంక్ సమీపంలో అ ల్లూరు వైపు నుంచి ఖాజీపాలెంకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు మార్గ మధ్యంలో గేదెను ఢీ కొట్టాడు. దీంతో వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో యువకునికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు.

వృత్తిని దైవ సమానంగా భావించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్



సుబ్బరాజును సన్మానిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ శాఖలో 40 ఏళ్లుగా సుదీర్ఘ సేవలు అందించడం హర్షనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ విభాగంలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీస్ అధికారులను మంగళవారం సన్మానించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఎస్ఐ జి.రామకోటేశ్వరరావు 1983లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి నెల్లూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారన్నారు. ఎస్ఐగా పదోన్నతి పొందిన అనంతరం బాపట్ల ఎస్బి విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేశారన్నారు. 1984లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలోకి అడుగుపెట్టిన అంగిరేకుల సుబ్బరాజు ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పోలీస్ శాఖకు చెందిన వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించి మొత్తం సర్వీసులో 42 రివార్డులను పొందారన్నారు. ప్రస్తుతం బాపట్ల డీసీఆర్బీ విభాగంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేశారన్నారు.వీరు సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు సేవలందించుటకు సహాయ సహకారాలు అందించిన వారి కుటుంబ సభ్యులకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ, ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఆహ్లాదకరంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గ్రామ స్వరాజ్యం



గణపవరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోన వెంకట్

కర్లపాలెం: వైఎస్సార్ సీపీతోనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతాయని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. మంగళవారం గణపవరం గ్రామంలో ఆయన వైఎస్సార్ సీపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వాలలో లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో తొలిసారిగా సచివాలయ వ్యవస్థ తీసుకురావటంతో పాటు గ్రామ వలంటీర్లను పెట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందే విధంగా పరిపాలన చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, నాయకులు నాగరాజురెడ్డి, రవి, కంకిపాటి నాగరాజు, మార్పు బెనర్జి తదితరులు ఉన్నారు.

భట్టిప్రోలు: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మండల ఎన్నికల పరిశీలకులు కొండా శివప్రసాద్ రెడ్డి(ఎస్పీ రెడ్డి) పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబును ఎమ్మెల్యేగా, పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్‌ను ఎంపీగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని తద్వారా జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని ఎస్పీ రెడ్డి అభ్యర్థించారు. తొలుత స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బండారు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, కుందేటి రమేష్, ఎంపీటీసీ సభ్యులు గద్దె సుశీల, డొక్కు నాగకుమారి, కొతరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజి, మోర్ల కోటేశ్వరరావు, గోవర్ధనగిరి పెదబుజ్జి, జాలాది దయమ్మ, మద్దుల గిరిధర్, తిరువీధుల వెంకటేశ్వర్లు, వేల్పూరి నాగేశ్వరరావు, బండారు దిలీప్, కొలుసు శ్రీనివాసరావు, కుక్కల భూషణరావు, అబ్దుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: కుల,మతాలకు అతీతంగా సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు నిఖిల్ అన్నారు.మండలంలోని అలకాపురం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడవసారి, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను రెండవసారి గెలిపించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, మండే విజయ్‌కుమార్, అల్లూరు సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, దబ్బుకూటి మాధవరావు, గుమ్మడి సీతయ్య, వాలి శివారెడ్డి, పమిడి గోపి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, శ్రీనివాసరెడ్డి, సుబ్బరాజు, డేవిడ్, బోసురాజు తదితరులు ఉన్నారు.

పింఛన్ నగదు పంపిణీలో మార్పులు

నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ

రేపల్లె రూరల్: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు నెలలు పించన్‌ల పంపిణీలో మార్పులు చేయటం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ నంబరుతో అనుసంధానమైన ఆధార్‌కార్డు కలిగిన బ్యాంక్ ఖాతా లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాలో పింఛను నగదును మే నెలకు సంబంధించి జమ చేయబడునన్నారు. అనుసంధానం కాని లబ్ధిదారులతో పాటు నడవలేని, ఆరోగ్యం సరిగాలేని వారికి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్ నగదు అందజేస్తారన్నారు. ఏ ఒక లబ్ధిదారుడు పింఛను కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. రేపల్లె మండలంలో 10,101 మంది లబ్ధిదారులు ఉండగా 7,565 మంది లబ్ధిదారులకు డీబీటీ విధానం ద్వారా నేరుగా ఖాతాలో జమ చేయటం జరుగుతుందన్నారు. మిగిలిన 2,536 మందికి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి అందజేస్తారన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

బాపట్లటౌన్: వేసవి తాపాన్ని తగ్గించేందుకే మజ్జిగ పంపిణీ చేస్తున్నామని సహృదయ ఫౌండేషన్ సభ్యులు గుడా భట్టుశర్మ తెలిపారు. కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సహృదయ ఫౌండేషన్ సభ్యులు పులిగడ్డ రామారావు, నాగరాజు, బాబూ నాగేంద్ర, నారాయణభట్టు, కాళిదాసు, శ్రీరామచంద్రమూర్తి, కొలను మోహన్, సాయి, పద్మవల్లి ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొంతెండి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: మూడు రోజులుగా తిండి తినకుండా మద్యం సేవిస్తూ నిద్రించిన వ్యక్తి మృతి చెందిన ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, దాళ్లవలస గ్రామానికి చెందిన కిల్లాన నారాయణరావు, అదే ప్రాంతానికి చెందిన అయినపల్లి సత్యారావు(32) నగర శివారులోని అంకిరెడ్డిపాలెం సమీపంలోని రామచంద్ర కోల్డ్ స్టోరేజ్‌లో కూలీ పనులు చేస్తు అక్కడే ఉన్న వర్కర్స్ గదుల్లో నివశిస్తూ ఉంటారు. గత మూడు రోజులుగా పనిలేకపోవటంతో ఇద్దరూ పూటుగా మద్యం సేవిస్తున్నారు. మూడు రోజులుగా భోజనం కూడా చేయకుండా మద్యం సేవిస్తూ ఉండి ఈ నెల 28 రాత్రి మద్యం మత్తులో తోటి కార్మికులతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారిన తర్వాత అందరూ లేచినా సత్యారావు నిద్ర లేవకపోవటంతో అనుమానం వచ్చి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు.